E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 13-05-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:130|| పేజీలు–6
www.ekaburu.com



కలెక్టర్లపైనా చర్యలకు వెనుకాడం

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక

క్షేత్రస్థాయిలో ధాన్యం, మక్కల కొనుగోళ్ల తీరును పరిశీలించాలి

ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి

లారీలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టండి

మిషన్ మోడ్‌లో పనిచేసి సేకరణ పూర్తి చేయాలన్న సీఎం

ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్

ఈకబురుహైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పనిచేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు

మిగతా 2లో

'నీట్' పరీక్ష రద్దు



పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ కీలక నిర్ణయం

అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడి.. త్వరలో పరీక్ష తేదీ ప్రకటన.. మళ్లీ అడ్మిట్ కార్డుల జారీ

రుసుము చెల్లించకుండా మరోసారి పరీక్షకు హాజరయ్యే అవకాశం

లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం.. మాస్టర్‌మైండ్ సహా 20 మందిని అదుపులోకి తీసుకున్న రాజస్తాన్ ఎస్ఓజీ

గెస్ పేపర్‌లోని కొన్ని ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంలో ప్రత్యక్షం

పరీక్షకు 15 రోజుల ముందే కొందరు అభ్యర్థులకు చేరిన గెస్ పేపర్

ఈకబురు, న్యూఢిల్లీ: వైద్య విద్య అభ్యసించి, డాక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఆశయంతో జాతీయ అర్హత,ప్రవేశ పరీక్ష(నీట్)కు హాజరైన లక్షలాది మంది అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పిడుగులాంటి వార్త వినిపించింది. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 3వ తేదీన జరిగిన నీట్(యూజీ)-2026 పరీక్షను రద్దు చేసినట్లు మంగళవారం ప్రకటించింది. నీట్ ప్రశ్నపత్నం లీక్ అయినట్లు అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో జాతీయ పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను కాపాడటం, విశ్వాసాన్ని నిలబెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేసింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐని కేంద్రం ఆదేశించిందని, దర్యాప్తు సంస్థకు తమ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని, అవసరమైన రికార్డులు సమకూరుస్తామని ఎన్‌టీఏ స్పష్టంచేసింది. పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత.. అంటే మే 7న సాయంత్రం అవకతవకలకు సంబంధించిన సమాచారం ఎన్‌టీఏకు అందింది. స్వతంత్ర ధ్రువీకరణతోపాటు అవసరమైన చర్యల కోసం మే 8వ తేదీ ఉదయం కేంద్ర దర్యాప్తు సంస్థలకు నివేదించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకే..

మిగతా 2లో

రాష్ట్రంలో 71,304 మంది కష్టం వృథా

ఈ-కబురు, హైదరాబాద్: నీట్ యూజీ-2026 రద్దు కావడంతో రాష్ట్రంలోని 70 వేల మందికిపైగా విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనుంది. రాష్ట్రవ్యాప్తంగా 73,024 మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదు చేసుకోగా.. 71,304 మంది (97.64 శాతం) రాశారు

మిగతా 2లో

రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు జూన్ 2న ప్రారంభం

పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్ పరిధిలో 5 నుంచి 8 కి.మీ. పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు

నియోజక వర్గం యూనిట్ గా స్థలాల గుర్తింపు

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత: కేసీఆర్

పాలన చేతకాక కాంగ్రెస్ క్రమంగా కనుమరుగవుతోంది

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

పార్టీ ముఖ్యులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఇంట్లో కూర్చోకుండా ప్రజలతో మమేకమై పనిచేయాలని పిలుపు

డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదుకు ఆదేశం

జిల్లాల వారీగా ఇన్‌చార్జీల నియామకం

ఈ-కబురు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలనపై జనంలో తీవ్ర అసంతృప్తి ఉందని చెప్పారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో వంద శాతం తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు.

మిగతా 2లో

రైల్ రోకో కేసులో కల్వకుంట్ల కవితకు సమన్లు

రేపు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన కల్వకుంట్ల కవిత

కవితతో పాటు మరో 12 మంది టీఆర్ఎస్ నాయకులపైనా కేసులు

బంగాళఖాతంలో అల్పపీడనం...

...48 గంటల్లో బలపడి... పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం

ఈ-కబురు, విశాఖపట్నం: ఏపీలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి

అస్సాం సీఎంగా హిమంత ప్రమాణం

హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా

ఈకబురు, గువాహటి, మే 12: అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండుసార్లు సీఎంగా ప్రమాణం చేసిన బీజేపీ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. హిమంతతో పాటు నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు.

మిగతా 2లో

నీట్ పేపర్ లీకేజీ.. పరీక్ష రద్దు

03

ప్రతీ కుటుంబానికి సంక్షేమం అందాలి

ఈకబురు, అమరావతి, మే 12: అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రభుత్వ పథకాల లబ్దిని ఉపయోగించుకుని పేద, మధ్య తరగతి కుటుంబాలు అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తీసుకొస్తున్నామని సీఎం వెల్లడించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."అభివృద్ధిసంక్షేమం అనేది సమపాళ్లల్లో అందిస్తూ పాలన చేస్తున్నాం. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాల్సిందే. ఈ మేరకు ఫ్యామ్లీ బెనిఫిట్ కార్డులను రూపొందిస్తున్నాం. అన్నక్యాంటీన్లల్లో నిత్యం తనిఖీలు చేస్తూనే ఉండాలి. ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా చూసుకోవాలి. పేదలు సంతృప్తిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేశాం. అన్నక్యాంటీన్ల ద్వారా పేదలకు డబ్బు ఆదా అవుతోంది.. మూడు పూటలా కడుపు నిండా ఆహారాన్ని అందిస్తున్నాం. మహిళలపై నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. తప్పు చేయాలంటే నేరస్తులు భయపడేలా ఉండాలి.

మిగతా 3లో

నా కుమారుడు తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే!

నా కుటుంబంపై కుట్రలు చేసినవాళ్లను వదిలిపెట్టను

హిందూ ఏక్తాయాత్రలో బండి సంజయ్ వ్యాఖ్యలు

ఈకబురు, కరీంనగర్: 'నిజంగా నా కుమారుడు తప్పు చేస్తే వందశాతం శిక్ష పడాల్సిందే.. చట్టం ముందు అందరూ సమానమే' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన మాట్లాడారు. "సమాజమే నా కుటుంబమనుకుని రేయింబవళ్లు ప్రజల కోసం పాటుపడ్డా.. 150 రోజులు 1,600 కి.మీ. పాదయాత్ర చేసి అన్నివర్గాల ప్రజల కష్టనష్టాల్లో భాగమయ్యా. ప్రజలే నా కుటుంబమనుకున్నా. కా

మిగతా 2లో

టైటాన్స్ అదరహో.. వరుసగా అయిదో విజయం

కలెక్టర్లపైనా చర్యలకు వెనుకాడం

సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై రేవంత్ ఆరా తీశారు.

ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలి

'గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలి. రవాణా శాఖ కమిషనర్ ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలి. ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు. అవసరమైతే స్థానికంగా ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకూడదు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు సీఎస్‌కు నివేదికలు పంపాలి.

రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను వాడుకోండి

సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు మిల్లుల్లో స్థలం సరిపోవడం లేదని అంటున్నారు. చాలా ప్రాంతాల్లో గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను తీసుకుని ధాన్యాన్ని అక్కడికి తరలించాలి. తర్వాత పరిస్థితిని బట్టి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి..'అని సీఎం ఆదేశించారు.

అకాల వర్షాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ

'అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా కలెక్టర్లు ప్రణాళికలు సిద్ధం చేయాలి. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.

ప్రతి మిల్లు వద్ద ఒక అధికారి ఉండాల

ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలి. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలి. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు ఇవ్వాలి. అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు..'అని ముఖ్యమంత్రి అన్నారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురండి: మంత్రి ఉత్తమ్

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం సేకరణ విషయంలో ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

పొరుగు రాష్ట్రాల ధాన్యంతో సమస్యలు: మంత్రి తుమ్మల

సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంతమంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. అలా ధాన్యం రాకుండా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత: కేసీఆర్

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ నేతలు ఇంటికి పరిమితం కాకుండా నిరంతరం ప్రజాక్షేత్రంలో జనంతో మమేకమవ్వాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక సమావేశం జరిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీమంత్రి హరీశ్‌రావుతో పాటు శాసనసభ, శాసన మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. సుమారు 7 గంటల పాటు సాగిన సమావేశంలో కేసీఆర్ కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న రాజకీయ పరిస్థితులను విశ్లేషించారు. పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణానికి సంబంధించి నేతలకు దిశానిర్దేశం చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం భేటీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

నేతల పనితీరును గమనిస్తున్నాం

'క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల పనితీరును నిశితంగా గమనిస్తున్నాం. పనిచేయని వారిని పక్కన పెడతాం. ప్రజా సమస్యలపై స్పందిస్తూ కష్టపడి పనిచేసే వారికే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయి. సీఎం రేవంత్ గుజరాత్ మోడల్‌ను పదే పదే వల్లె వేస్తున్నాడు. తెలంగాణలో బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో గుజరాత్ మోడల్‌ను మించి ఫలితాలు సాధించాం. జాతీయ స్థాయిలో అనేక సూచీల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ప్రభుత్వానికి నిధుల సమీకరణ, వనరుల వినియోగం వంటి అంశాలపై ఏ మాత్రం అవగాహన లేదు. పాలన చేతకాక కాంగ్రెస్ క్రమంగా కనుమరుగవుతోంది..' అని కేసీఆర్ చెప్పారు.

ప్రతి నియోజకవర్గానికి సమన్వయకర్త

రాజకీయ విమర్శల జోలికి వెళ్లకుండా పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తలకు శిక్షణ వంటి అంశాలపైనే కేసీఆర్ ఎక్కువగా మాట్లాడినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఆయా అంశాలపై నేతల అభిప్రాయాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ పద్ధతిలోనే పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని ఆదేశించారు. 'ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన 'సర్' ప్రక్రియతో పాటు, ఓటర్ లిస్టు సవరణ తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్ ప్రక్రియలో జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యత్వం కూడా డిజిటల్ పద్ధతిలోనే జరపాలి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి, రాష్ట్ర కమిటీ నుండి సభ్యత్వ నమోదు సమన్వయకర్తను నియమించాలి.

కార్యకర్తలకు శిక్షణ

అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు 'సభ్యత్వ సమన్వయ కమిటీ'లను రెండుమూడు రోజుల్లో నియమించాలి. డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు చేస్తున్నందున రాష్ట్రంలో ఉన్న 35,655 పోలింగ్ బూత్‌లకు బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించాలి. పార్టీ ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరాలు కొనసాగుతాయి..' అని కేసీఆర్ తెలిపారు. సభ్యత నమోదు కోసం ఇన్‌చార్జిలను ప్రకటించారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు పలువురు కూడా పాల్గొన్నారు.

---సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం నియమించిన ఇన్‌చార్జిల వివరాలు....

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, ఎంఎల్సీ, ప్రధాన కార్యదర్శి
జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలు – జీవన్ రెడ్డి, మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి
ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలు – సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి
జనగాం, హనుమకొండ, వరంగల్ జిల్లాలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, ప్రధాన కార్యదర్శి
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు గ్యాదరి బాలమల్లు, ప్రధాన కార్యదర్శి
నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు గంగాధర్ గౌడ్ మాజీ ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి
మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలు నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి
ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి
వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే
మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలు — మహమూద్ అలీ, మాజీ మంత్రి
గద్వాల్,నాగర్‌కర్నూల్,వనపర్తి జిల్లాలు— మెట్టు శ్రీనివాస్, కార్యదర్శి
మేడ్చల్‌మల్కాజిగిరి,యాదాద్రి జిల్లాలు — పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్సీ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్
–హైదరాబాద్ జిల్లా— తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే
–నల్గొండ, సూర్యాపేట జిల్లాలు — ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి

'నీట్' పరీక్ష రద్దు

పరీక్షకు ముందే 410 ప్రశ్నలతో కూడిన 'గెస్ పేపర్'కొందరు అభ్యర్థుల మధ్య సర్క్యులేట్ అయ్యిందని, అందులో 120 కెమిస్ట్రీ, 100కు పైగా బయాలజీ ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంతో యథాతథంగా సరిపోలాయన్న ప్రచారంతో 'నీట్'ను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడమే ఉత్తమమన్న నిర్ణయానికి వచ్చినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ నెల 3న భారత్‌తోపాటు విదేశాల్లో జరిగిన నీట్ (యూజీ)-2026 పరీక్షను 22.79 లక్షల మంది రాశారు.

పేపర్ లీకేజీతో వారంతా నిరాశకు గురయ్యారు. పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని, అభ్యర్థులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎన్‌టీఏ ప్రకటించింది. పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలియజేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించడం వల్ల అభ్యర్థులకు, తల్లిదండ్రులకు అసౌకర్యం కలిగే మాట నిజమేనని ఎన్‌టీఏ అంగీకరించింది. కానీ, పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకు నీట్ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

'గెస్ పేపర్'కోసం రూ.30 లక్షలు

'గెస్ పేపర్'కోసం ఒక్కో విద్యార్థి దాదాపు రూ.30 లక్షల చొప్పున వెచ్చించినట్లు తమ విచారణలో తేలిందని రాజస్తాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్(ఎస్ఓజీ) ఏడీజీ విశాల్ బన్సాల్ మీడియాకు తెలిపారు. ఈ గెస్ పేపర్ పరీక్షకు 15 రోజుల ముందే అభ్యర్థులకు చేరిందన్నారు. డెహ్రాడూన్ నుంచి కేరళ మీదుగా సికార్‌కు చేరిన ఈ పేపర్‌ను ఒక్కో విద్యార్థి రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు విచారణలో బయటపడిందన్నారు.

పరీక్ష ముందు రాత్రి అంటే.. మే 2వ తేదీ రూ.30 వేలకు కూడా కాపీలు అమ్మినట్లు ఆధారాలు లభించాయని ఎన్‌టీఏకు, కేంద్ర పభుత్వానికి నివేదించారు. ఎస్ఓజీ దర్యాప్తులో భాగంగా లభించిన ఆధారాలతో ఇప్పటివరకు మాస్టర్‌మైండ్ సహా 20 మందికి పైగా అదుపులోకి అనుమానితులను తీసుకున్నట్లు సమాచారం. నీట్ పేపర్ లీకేజీకి జైపూర్‌కు చెందిన మనీష్ అనే వ్యక్తిని మాస్టర్ మైండ్‌గా గుర్తించారు. రాజస్తాన్‌లో సికార్ పట్టణానికి చెందిన ఒక కోచింగ్ కెరీర్ కౌన్సెలర్‌ను అరెస్టు చేశారు.

ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ

నీట్ పేపర్ లీక్ అంశం దేశవ్యాప్తంగా దుమారం సృష్టించింది. పలు ప్రాంతాల్లో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్‌టీఏ స్పందించి పరీక్షను రద్దు చేసింది. లీకేజీ వ్యవహారంలో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. సీబీఐ రంగంలోకి దిగింది. ఇప్పటికే రాజస్తాన్ పోలీసుల దర్యాప్తులో లభించిన వాట్సాప్ చాటింగ్‌లు, స్క్రీన్‌షాట్లు, బ్యాంక్ లావాదేవీల వివరాలు, యూపీఐ చెల్లింపులు, క్రిప్టో చెల్లింపులను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పరీక్ష జరిగిన అన్ని సెంటర్ల సీసీటీవీ ఫుటేజీ, బయోమెట్రిక్ డేటాను సేకరించారు. ఆ డేటాను, ఆధారాలను రాజస్తాన్ పోలీసులు సీబీఐకి అప్పగించారు. నీట్ (యూజీ) పేపర్ లీక్ అంశంపై సీబీఐ మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

ముఖం చాటేసిన విద్యాశాఖ మంత్రి

నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మౌనం వహించారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మీడియా ప్రతినిధులు ప్రశ్నించేందుకు ప్రయత్నించగా, తప్పించుకుని కారెక్కి వెళ్లిపోయారు.

మహారాష్ట్రలో వ్యక్తి అరెస్టు

నీట్ పేపర్ లీక్ అంశానికి సంబంధించి మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజస్తాన్ పోలీసులు అందించిన సమాచారం మేరకు అతడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అతడిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడానికి రాజస్తాన్ పోలీసుల బృందం రానున్నట్లు పేర్కొన్నారు.

సందేహాలు - సమాధానాలు

నీట్ రద్దు కావడంతో అభ్యర్థులు, తల్లిదండ్రుల్లో రకరకాల సందేహాలు తలెత్తుతున్నాయి. వీటిపై నీట్ వర్గాలు కొంత స్పష్టత ఇచ్చాయి.

మళ్లీ పరీక్ష ఎప్పుడు?

నీట్ తేదీని ఇంకా ప్రకటించలేదు. ఎప్పుడు నిర్వహించాలన్నది ఇంకా నిర్ణయించలేదు.

మళ్లీ రిజిస్టర్ చేసుకోవాలా?

అవసరం లేదు. ఇప్పటికే చేసుకున్న రిజిస్ట్రేషన్ డేటా, అభ్యర్థిత్వాన్ని త్వరలో మళ్లీ నిర్వహించే పరీక్షకు బదిలీ చేస్తారు.

ఫీజు చెల్లింపు మాటేమిటి?

ఈ ఏడాది నీట్ రాసిన అభ్యర్థులు మళ్లీ పరీక్ష రాయడానికి అదనంగా ఫీజులు చెల్లించాల్సిన పనిలేదు. గతంలో చెల్లించిన రుసుమును అభ్యర్థులకు తిరిగి(రీఫండ్) చెల్లిస్తారు.

అడ్మిట్ కార్డులు కొత్తగా ఇస్తారా?

అవును. కొత్త అడ్మిట్ కార్డుల జారీపై త్వరలో అధికారికంగా ప్రకటన చేస్తారు.

పరీక్షా కేంద్రాలను మారుస్తారా?

మే 3న జరిగిన పరీక్షకు ఎంచుకున్న కేంద్రాలనే తిరిగి నిర్వహించే పరీక్షకు కూడా కొనసాగిస్తారు.

పది రోజుల్లోగా షెడ్యూల్: అభిషేక్

నీట్ పునఃపరీక్ష షెడ్యూల్‌ను రాబోయే 7 నుంచి 10 రోజుల్లోగా ప్రకటిస్తామని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మంగళవారం తెలిపారు. అతి త్వరలో తన బృందంతో చర్చిస్తానని, పూర్తి పరీక్షల షెడ్యూల్, తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీల విద్యా క్యాలెండర్, ప్రవేశాల షెడ్యూల్‌కు అంతరాయం కలగకుండా వీలైనంత తక్కువ సమయంలోనే పరీక్ష నిర్వహించడానికి కృషి చేస్తామని చెప్పారు. మరో వారం, పది రోజుల్లోగానే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. లీకేజీ ఘటన నిజంగా బాధాకరమని, ఇలాంటివి తక్షణమే ఆగిపోవాలని అభిషేక్ సింగ్ తేల్చిచెప్పారు. పేపర్ లీకేజీలు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అలాగే మొత్తం వ్యవస్థకు ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. జరిగిన దానికి తాము బాధ్యత తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి అవకతవకలు జరగకుండా పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టంచేశారు.

నీట్‌కు ముందు

విద్యార్థుల మధ్య పీడీఎఫ్ ఫార్మాట్‌లో సర్క్యులేట్ అయిన కొన్ని ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో సరిపోలడంతో పరీక్షను రద్దు చేయాలని తాము సిఫార్సు చేశామని వివరించారు. మొత్తం పేపర్ లీక్ కాలేదని చెప్పారు.

అస్సాం సీఎంగా హిమంత ప్రమాణం

ఈకబురు, గువాహటి, మే 12: అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండుసార్లు సీఎంగా ప్రమాణం చేసిన బీజేపీ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. హిమంతతో పాటు నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో బీజేపీ నుంచి ఇద్దరు.. రామేశ్వర్ తెలీ, అజంతా నేగ్, అసోం గణ పరిషత్(ఏజీపీ) నుంచి అతుల్ బోరా, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్(బీపీఎఫ్) నుంచి చరణ్ బోరో ఉన్నారు. ఖానాపారాలోని వెటర్నరీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన వేదికపై గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య వీరితో ప్రమాణం చేయించారు. హిమంత ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ, సర్బానంద సోనోవాల్, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హాజరయ్యారు

రాష్ట్రంలో 71,304 మంది కష్టం వృథా

. ఈసారి ప్రశ్నపత్రం కాస్త సులువుగా వచ్చిందని విద్యార్థులు ఊపిరి పీల్చుకుంటూ ఫలితాల కోసం వేచిచూస్తున్న సమయంలోనే 'నీట్'ను రద్దుచేస్తూ ఈ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటన చేయడం ఆయా విద్యార్థులకు అశనిపాతంలా మారింది.

జాతీయ స్థాయిలో వైద్య విద్యార్థులందరికీ ఒకే అర్హత పరీక్ష ఉండాలని 201617 నుంచి నీట్ యూజీ, పీజీ పరీక్షలను ప్రారంభించారు. 2019 నుంచి ఎన్‌టీఏ దీన్ని నిర్వహిస్తూ వస్తోంది. గత కొన్నేళ్లుగా పరిశీలిస్తే.. నీట్ యూజీ, పీజీ ప్రశ్నపత్రాల లీకేజీలు, వాయిదాలు వంటి పరిణామాలతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. 2024లో 'నీట్ యూజీ' ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నా ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగినట్లు విచారణలో తేలింది. ఈ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లడంతో లీకైన చోట 1,563 మంది విద్యార్థులకు పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించారు. ఇక 'నీట్ పీజీ' సైతం 2024లో వాయిదా పడడం గమనార్హం. పలు అవకతవకల క్రమంలో ఆ సంవత్సరం జూన్ 23న జరగాల్సిన పరీక్ష ఆగస్టు 11న జరగడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

అనేక చర్యలు తీసుకుంటున్నా..

'నీట్'ను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఎన్‌టీఏ విద్యార్థులకు అనేక ఆంక్షలు విధిస్తోంది. ధరించే దుస్తుల నుంచి బూట్లు, పరికరాలు, సమయంపై అనేక రకాల నిబంధనలు పెడుతున్నారు. వైద్యవృత్తిలోకి వెళ్లాలనే లక్ష్యంతో ఏడాదిపాటు రాత్రింబవళ్లు శ్రమించి విద్యార్థులు పరీక్షకు సిద్ధమవుతున్నారు. ఈసారి ప్రవేశ పరీక్ష జరిగిన రోజు మండుటెండల్లో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. గతంలో ప్రశ్న పత్రాల లీకేజీ తదితర పరిణామాల నేపథ్యంలో ఎన్‌టీఏ సైతం మే 2, 3వ తేదీల్లో వైద్య కళాశాలల విద్యార్థులకు సెలవులు ఇవ్వొద్దని 'జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)'ని కోరింది. ఈ రెండు రోజులు వైద్య విద్యార్థులకు కళాశాలలు సెలవులు ఇవ్వకుండా కట్టడి చేశాయి. విద్యార్థులపై అనేక ఆంక్షలు విధిస్తున్నారని, మరోవైపు కొన్ని మురాలు యథేచ్ఛగా లీకులు చేస్తున్నా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఒకసారి పరీక్ష రాశాక అది రద్దయితే మరోసారి పరీక్ష రాయాల్సి రావడం విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య కళాశాలల బోధకులు అభిప్రాయపడుతున్నారు.

కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి: మంత్రి రాజ నర్సింహ

ఈనాడు, హైదరాబాద్: నీట్ రద్దు కావడం అత్యంత దురదృష్టకరమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ''రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 70వేల మంది, దేశవ్యాప్తంగా 22లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. వారి భవిష్యత్తును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఇబ్బందుల్లోకి నెట్టింది. పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏ పూర్తిగా విఫలమైంది. గతంలో జరిగిన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకోకుండా నిర్లక్ష్యం వహించింది. ఇంత పెద్ద తప్పిదానికి కారణమైన వారిపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలి. మనోవేదనకు గురవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుంది'' అని మంత్రి తెలిపారు.

నా కుమారుడు తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే!

ఈకబురు, కరీంనగర్: 'నిజంగా నా కుమారుడు తప్పు చేస్తే వందశాతం శిక్ష పడాల్సిందే.. చట్టం ముందు అందరూ సమానమే' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన మాట్లాడారు. ''సమాజమే నా కుటుంబమనుకుని రేయింబవళ్లు ప్రజల కోసం పాటుపడ్డా.. 150 రోజులు 1,600 కి.మీ. పాదయాత్ర చేసి అన్నివర్గాల ప్రజల కష్టనష్టాల్లో భాగమయ్యా. ప్రజలే నా కుటుంబమనుకున్నా. కానీ, నా కుటుంబానికి, నా కుమారుడికి సమయమివ్వకుండా పొరపాటు చేశా. తప్పు నాదే. ఎప్పుడూ మాట్లాడలేకపోయా. అందుకే సమాజానికి నేను క్షమాపణ చెబుతున్నా. సమాజం ముందు కుమారుడిని క్రిమినల్‌లా చూపిస్తే ఏ తండ్రికైనా బాధేస్తుంది. 'తప్పు చేయలేదు నాన్నా.. ఫ్రెండ్స్‌లాగా కలిసి ఉన్నాం. తరువాత విడిపోయాం.. నిజాయతీగా బయటికొస్తా' అని నా బిడ్డ నాతో చెప్పాడు. నేను అతడిని సమర్థించట్లేదు. తప్పు ఎవరు చేసినా తప్పే.. నా బిడ్డకు ఒక న్యాయం, ఇతరులకు ఇంకో న్యాయం అంటూ ఉండదు. అతడు నిజంగా తప్పు చేస్తే శిక్షను ఎదుర్కోవాల్సిందే. ఈ రోజు నా భార్య కూడా నా దారిలో నడుస్తున్నారు. బ్యాంకు ఉద్యోగానికి సెలవు పెట్టి ఇంట్లో ఉంటూ నన్ను నమ్మిన కార్యకర్తలకు సహాయం చేస్తున్నారు. ఇప్పుడు ఆ కన్నపేగు డిప్రెషన్‌లోకి పోతోంది.. విలపిస్తోంది. కుటుంబంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడి చేస్తుంటే ఏ కన్నతల్లి మాత్రం భరించగలదో ఆలోచించండి. బండి సంజయ్ భయపడే వ్యక్తి కాదు. రాముడంతటి దేవుడికే కష్టమొచ్చింది. తరువాత ఆదర్శ రాముడిగా నిరూపించుకున్నాడు. నా జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డాను. సామాన్య కార్యకర్తగా జెండాలు కట్టిన నేను ఈ రోజు ఈ స్థాయిలో నిలబడ్డాను. నా భుజం మీద కాషాయ జెండా.. నా శిరసుపై అమ్మవారి ఆశీస్సులున్నాయి. నన్ను ఈరోజు కొందరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారికి చెబుతున్నా. మీరు పెట్టిన నిప్పుతోనే మీ భరతంపడతా. ఆంజనేయ స్వామి లంకను కాల్చినట్టు.. తెలంగాణలో దళారుల వ్యవస్థను, కుటుంబ పాలన వ్యవస్థను, అవినీతి వ్యవస్థను పక్కాగా దహనం చేస్తా. ఎవరైతే కుట్రలు, కుతంత్రాలు చేస్తూ.. నా కుటుంబాన్ని బజారుకీడ్చారో.. నా కార్యకర్తల్లో ఆవేదనను రగిల్చారో.. నా పార్టీని ఇబ్బందుల్లో పెట్టారో.. వారిలో ఏ ఒక్కరినీ నేను విడిచిపెట్టే ప్రసక్తి లేదు. భారాస హయాంలో 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు.. వారి కుటుంబాల బాధలు నాకు తెలుసు. మళ్లీ వారి కుటుంబాలను కలుస్తా'' అని అన్నారు.

అక్రమ కల్లు దుకాణాలను తొలగించాలి

ఆర్సీపురం బీఆర్ఎస్ మాజీ పట్టణాధ్యక్షుడు గోవింద్

ఈ-కబురు, పటాన్ చెరు :
ఎలాంటి అనుమతులు లేకుండా యదేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ కల్లు దుకాణాలపై చర్యలు తీసుకుని వెంటనే తీసివేయాలని బీఆర్ఎస్ పార్టీ రామచంద్రాపురం పట్టణ మాజీ అధ్యక్షుడు గోవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రామచంద్రాపురం పట్టణంలో చాలా కల్లు దుకాణాలు ఎటువంటి అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయని, ఈవిషయం అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. మొత్తం రామచంద్రాపురంలో ఎన్ని కల్లు దుకాణాలకు ఎక్సైజ్ శాఖా నుంచి అనుమతులు ఉన్నాయో పూర్తి వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరడం జరిగిందన్నారు. అధికారులు అందించిన వివరాలు ప్రకారం రామచంద్రాపురంలో బస్ డిపో రూట్లో ఒక కల్లు డిపో ఉండగా, రామచంద్రాపురంలో ఒకటి, కానుకుంటలో ఒకటి, శ్రీనివాస నగర్ కాలనీలో ఒకటి, బాంబే కాలనీలో ఒక కల్లు దుకాణానికి మాత్రమే అనుమతులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎక్సయిజ్ శాఖ అధికారులకు తెలిసే రామచంద్రాపురంలో అక్రమంగా కల్లు దుకాణాలు నడుస్తున్నాయని, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాల్లో కల్లు దుకాణాలను పెట్టి వ్యాపారం సాగిస్తున్నారని అటువంటి వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రామచంద్రాపురం పట్టణ పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ షెడ్లపై చర్యలు తీసుకోవాలని గోవింద్ డిమాండ్ చేశారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడటమే కాకుండా ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు షెడ్లను వేసుకుంటూ తమ వ్యాపారాలను సాగిస్తున్నారని అన్నారు. జిహెచ్ఎంసి టౌనప్లానింగ్ శాఖా అధికారులకు ఈవిషయం తెలిసినప్పటికి ఏమీ పట్టనట్లు ఉండటంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. ఎవరైనా చిన్నపాటి ఇళ్లు నిర్మించుకుంటే అందుకు అనుమతులు ఉన్నాయా లేవా అని పరిశీలించే టౌన్ ప్లానింగ్ అధికారులు జాతీయ రహదారికి ఇరువైపులా వెలసిన షెడ్లను ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. అన్ని షెడ్లను పరిశీలిస్తే ఎన్ని షెడ్లకు అనుమతులు ఉన్నాయి, వేటికి అనుమతులు లేవు అనే విషయాలు పూర్తిగా బహిర్గమవుతాయన్నారు. ఈవిషయంలో జిహెచ్ఎంసి అమీన్పూర్ సర్కిల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేని కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ షెడ్లను గుర్తించి వెంటనే వాటిని తీసివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం చేసేందుకు సైతం సిద్ధమని హెచ్చరించారు. ఈ అక్రమాలపై న్యాయ పరంగా వెళ్తామని గోవింద్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షుడు గోవింద్

ప్రతీ కుటుంబానికి సంక్షేమం అందాలి

ఈకబురు, అమరావతి, మే 12:
అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రభుత్వ పథకాల లబ్దిని ఉపయోగించుకుని పేద, మధ్య తరగతి కుటుంబాలు అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తీసుకొస్తున్నామని సీఎం వెల్లడించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."అభివృద్ధిసంక్షేమం అనేది సమపాళ్లల్లో అందిస్తూ పాలన చేస్తున్నాం. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాల్సిందే. ఈ మేరకు ఫ్యామ్లీ బెనిఫిట్ కార్డులను రూపొందిస్తున్నాం. అన్న క్యాంటీన్లల్లో నిత్యం తనిఖీలు చేస్తూనే ఉండాలి. ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా చూసుకోవాలి. పేదలు సంతృప్తిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేశాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు డబ్బు ఆదా అవుతోంది.. మూడు పూటలా కడుపు నిండా ఆహారాన్ని అందిస్తున్నాం. మహిళలపై నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఊపేక్షించవద్దు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. తప్పు చేయాలంటే నేరస్తులు భయపడేలా ఉండాలి. ఆ పరిస్థితి వచ్చేలా పోలీసింగ్ ఉండాల్సిన అవసరం ఉంది. అన్నిప్రభుత్వ కార్యాలయాలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. దీన్ని తప్పకుండా ఆచరించేలా చూడాలి. ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలభించేలా రైతుల్లో మరింత అహగాహన కల్పించాలి. వ్యవసాయంలో రీసెర్చ్ వర్క్ మరింత పెంచాలి. ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లించడంతోపాటు... ఉద్యాన పంటల వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలి. అలాగే ఏయే పంటలు వేసుకోవాలనే అంశం మీద రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలి' అని సీఎం స్పష్టం చేశారు.
టెక్నాలజీ ఇంటిగ్రేషన్ కు అధికారులు ప్రాధాన్యమివ్వాలి
'జలధారజలహారతి పనులను మరింత వేగవంతం చేయాలి. జరుగుతున్న పనులను మ్యాపింగ్ చేసుకోవాలి. జలధార పనులను కాస్ట్ ఎఫెక్టివ్ తరహాలో చేపట్టాలి. నీటి భద్రత అనేది ప్రభుత్వ ప్రాధాన్యాతంశాల్లో ఒకటిగా ఉంది. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. నిధులు కూడా ఇస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ఉండే రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. సమాచారం తెప్పించుకోవాలి. కొన్ని జిల్లాల్లో బస్సులకు సీసీ కెమెరాలు పెట్టి రోడ్ల పరిస్థితిని అంచనా వేస్తున్నారు. అదే తరహాలో వినూత్నంగా క్షేత్ర స్థాయి నుంచి ఆ సమాచారాన్ని ఎలా రప్పించుకోవాలనే ఆలోచన చేయాలి. పాత్ హోల్స్ సమస్య ఉండకూడదు. ప్రపంచంలోని ప్రతి లేటెస్ట్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావాలి. అమరావతికి ఈ టెక్నాలజీలను తీసుకువస్తే... ఇక్కడ యువతకు చాలా ఉపయోగంగా ఉంటుంది. ఐటీలో భారతీయులు, తెలుగు వాళ్లు ప్రపంచంలోనే ఛాంపియన్లుగా నిలిచారు. అలాగే కొత్త రకం టెక్నాలజీల విషయంలోనూ మనమే ముందుండాల్సిన అవసరం ఉంది. టెక్నాలజీ పరంగా పెద్ద ఎత్తున రీసెర్చ్ చేపట్టేలా ఎకో సిస్టంను అభివృద్ధి చేయాలి. పరిపాలనలో ప్రిడెక్టివ్ అడ్వాన్సుడ్ ప్లానింగ్ ఉండాలి. డేటా డ్రివెన్ నిర్ణయాలు తీసుకోవాలి. ఈ మేరకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీ.. పరీక్ష రద్దు

కేంద్రంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆగ్రహం
పరీక్ష రద్దు కేంద్రం వైఫల్యమన్న కేటీఆర్
2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందన్న కేటీఆర్

ఈకబురు, హైదరాబాద్ ;
వైద్య విద్య జాతీయ అర్హత పరీక్ష (నీట్ యూజీ) 2026 పరీక్ష రద్దుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్ష రద్దు పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఇది కేంద్రానికి సిగ్గుచేటు అన్నారు.ఎన్డీయే వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ అయ్యాయని ఆరోపించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందని గుర్తు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు.నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దుపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీతో ప్రతి దశలో మోసాలు కనబడుతున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష వ్యవస్థే పెద్ద కుంభకోణమని, ప్రతి సంవత్సరం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు జూన్ 2న ప్రారంభం

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్
ఈనెల చివరిలోగా హైదరాబాద్ లో ఇండ్ల స్థలాలు కలిగిన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు
అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించేది లేదు
ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్ష లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఈకబురు,హైదరాబాద్, మే 12 :
రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.
రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ .పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్

2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్ధిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశించారు.

అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదు

అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు.మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమలు ఐటి శాఖలు, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ముఖ్యమైనదని అన్నారు. ఇది చాల పకడ్బందీగా అమలవుతున్నదని ఈ పథకాన్ని ఇదే విధంగా ముందుకు తీసుకెళ్లాలని, పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పేదరికమే అర్హతగా లబ్దిదారుల ఎంపిక చేపడుతున్నామని ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని స్పష్టం చేశారు. తాము ఎలాంటి భేషజాలకు పోవడం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. కలెక్టర్లు ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. శాసనసభ స్పీకర్ జి. ప్రసాద కుమార్ మాట్లాడుతూ శాసనసభలో తీసుకున్న నిర్ణయం మేరకు సమావేశాలు నిర్వహించడం పట్ల మంత్రిగారికి అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా గొప్పగా అమలు అవుతున్నదని, జిల్లా స్థాయిలో కలెక్టర్లు ప్రతివారం ఈ పథకాన్ని సమీక్షించి పేదలకు మేలు కలిగేలా చూడాలన్నారు

రైల్ రోకో కేసులో కల్వకుంట్ల కవితకు సమన్లు

ఈకబురు,, తెలంగాణ బ్యూరో :
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు. రైల్ రోకో కేసులో కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నారు. 2025 నవంబర్ 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో చేపట్టారు.. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించి పంపిన బీసీ బిల్లులకు వెంటనే ఆమోదం తెలుపాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు.. కల్వకుంట్ల కవితతో పాటు రైల్ రోకో చేస్తున్న టీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. కల్వకుంట్ల కవితతో పాటు టీఆర్ఎస్ నాయకులు చేపట్టిన రైల్ రోకో కారణంగా సిర్నపల్లి - ఇందల్వాయి రైల్వే స్టేషన్ల మధ్య నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న దేవగిరి ఎక్స్ ప్రెస్ ను నిలిపివేశారు. అలాగే హైదరాబాద్ నుంచి నిజామాబాద్ రూట్ లో ప్రయాణిస్తున్న మరో గూడ్స్ రైలును నిలిపివేశారు. రైల్ రోకో చేపట్టిన కల్వకుంట్ల కవితతో పాటు మరో 12 మంది నాయకులపై కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ రవీంద్ర బాబు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కవితతో పాటు 12 మంది టీఆర్ఎస్ నాయకులపై U/Sec.147&74(a) Railway Act కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సికింద్రాబాద్ రైల్వేస్ సెకండ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసెస్ కోర్టు జారీ చేసిన సమన్లలో పేర్కొన్నారు

బంగాళఖాతంలో అల్పపీడనం...

ఈకబురు,, విశాఖపట్నం:
ఏపీలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్నిప్రాంతాల్లో పిడుగులతోకూడిన వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో ఎండ ప్రభావం చూపుతోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. ఉత్తర తమిళనాడు, రాయలసీమ, కర్ణాటక మీదుగా మరాఠ్వాడా వరకు ద్రోణి విస్తరించిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ద్రోణి ప్రభావంతో అల్లూరి సీతారామరాజు, పోలవరం, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం కర్నూలు జిల్లా నగరడోనలో 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది. నంద్యాల జిల్లా కొత్తపల్లెలో 42.4, పోలవరం జిల్లా ఎర్రంపేటలో 42, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 41.9, మార్కాపురం జిల్లా కంభంలో 41.7, పల్నాడు జిల్లా గురజాలలో 41.3, అనంతపురం జిల్లా తెరన్నపల్లి, వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో 41.1, అనకాపల్లి జిల్లా దేవరపల్లిలో 41, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిలో 40.6, చిత్తూరు జిల్లా రాయలపేటలో 40.5, ఏలూరు జిల్లా కు

బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

ఈ-కబురు, హైదరాబాద్ ;
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు.ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో మధ్యంతర బెయిల్ కోరుతూ బగీరథ్ తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు కూడా ఈ కేసు విషయమై సమగ్ర దర్యాప్తు అనంతరం మాత్రమే వివరాలు వెల్లడించడం జరుగుతుందని అంటున్నారు.

వడ్డీ రేట్లు.. పెట్రోలు రేట్లు పెరుగుతాయ్

2026-27లో వృద్ధి 6 శాతమే! హెచ్ఎస్‌బీసీ నివేదిక

ముంబయి: ఇంధన సంక్షోభం, తక్కువ వర్షపాతం దేశ జీడీపీ వృద్ధిని 2026 27లో 6 శాతానికి పరిమితం చేసే అవకాశం ఉందని విదేశీ బ్రోకరేజీ హెచ్ఎస్‌బీసీ నివేదిక వెల్లడించింది. 202526లో ఇది 7.4 శాతంగా నమోదు కావొచ్చని తెలిపింది. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉండటంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు సార్లు వడ్డీ రేట్లు పెంచొచ్చని అంచనా వేసింది. ప్రస్తుత సంక్షోభం సంఘటిత రంగంతో పాటు గ్రామీణ కుటుంబాలు, చిన్న సంస్థలపై అధికంగా పడొచ్చని తెలిపింది. ఇదిలా ఉంటే గత నెలలో ఆర్‌బీఐ 202627లో జీడీపీ వృద్ధి 6.9 శాతం నమోదు కావొచ్చని అంచనా వేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో ముడి చమురు ధర అమాంతం పెరిగి బ్యారెల్‌కు 100 డాలర్ల పైనే ట్రేడవుతోంది. దీనికి తోడు ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో ఈ రెండూ ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్ఎస్‌బీసీ నివేదిక తెలిపింది. 202627లో ద్రవ్యోల్బణం 5.6 శాతానికి చేరొచ్చని పేర్కొంది. దీంతో ఆర్‌బీఐ డిసెంబరు, మార్చి త్రైమాసికాల్లో రెండు సార్లు వడ్డీ రేట్లను పెంచొచ్చని అంచనా వేసింది. లీటరుకు రూ.7 చొప్పున: ఏడాదికి రూ.30,000 కోట్ల నష్టాలను చవి చూసే అవకాశం ఉన్న చమురు మార్కెటింగ్ సంస్థల (ఓఎంసీ) భారాన్ని కొంతమేర తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.7 చొప్పున పెంచే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ ధరలు పెంచకపోతే సగటు ద్రవ్యోల్బణం 5.3 శాతంగా నమోదు కావొచ్చని వెల్లడించింది.

ఇతర సంస్థల అంచనాలిలా.. ముడి చమురు ధరల షాక్‌తో భారత జీడీపీ వృద్ధి 202627లో 6.7 శాతానికి పరిమితం కావొచ్చని ఫిచ్ గ్రూప్ సంస్థ బీఎంఐ అంచనా వేసింది. 202526లో వృద్ధి 7.7 శాతం ఉండొచ్చని, 2026 జనవరిమార్చి త్రైమాసికంలో 8 శాతం నమోదు కావొచ్చని తెలిపింది. భారత జీడీపీ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.6 శాతంగా నమోదు కావొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2026 జనవరిమార్చి త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి 7.2 శాతంగా నమోదు కావొచ్చని, 202526 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఇది 7.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది.

కెనరా బ్యాంక్ లాభం రూ.4,506 కోట్లు

హర్దీప్ సింగ్ అహ్లూవాలియా

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంకు 202526 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసిక నికర లాభంలో 10 శాతం క్షీణతను నమోదు చేసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ లాభం 12.7 శాతం పెరిగింది. వాటాదారులకు ప్రతి ఈక్విటీ షేరుపై రూ.4.20 డివిడెండ్‌ను చెల్లించేందుకు బ్యాంక్ బోర్డు సిఫారసు చేసింది. మార్చి త్రైమాసికంలో కెనరా బ్యాంక్ నికర లాభం స్టాండలోన్ ప్రాతిపదికన రూ.4,506 కోట్లకు పరిమితమైంది. అంత క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.5,002.66 కోట్లుగా ఉంది. జనవరిమార్చి కాలానికి బ్యాంక్ మొత్తం ఆదాయం సైతం 1.85 శాతం తగ్గి, గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ. 37,353 కోట్ల నుంచి రూ. 36,662 కోట్లకు పడిపోయింది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం దాదాపు 4 శాతం పెరిగి రూ.9,442 కోట్ల నుంచి రూ.9,808 కోట్లకు చేరుకుంది. 202526 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కెనరా బ్యాంక్ వార్షిక నికర లాభం 12.7 శాతం వృద్ధితో రూ.19,187 కోట్లుగా నమోదైంది. బ్యాంక్ మొత్తం ఆదాయం 202425 ఆర్థిక సంవత్సరంలోని రూ.1,42,208 కోట్ల నుంచి 202526లో రూ. 1,53,204 కోట్లకు పెరిగింది.

మెరుగుపడిన ఆస్తుల నాణ్యత..... 2026 మార్చి చివరి నాటికి స్థూల మొండి బకాయిలు 2.94 శాతం నుంచి 1.84 శాతానికి తగ్గాయి. విలువల పరంగా చూస్తే స్థూల ఎన్‌పీఏలు రూ.31,530 కోట్ల నుంచి రూ. 22,740 కోట్లకు దిగివచ్చాయి. నికర మొండి బకాయిలు 0.70 శాతం (రూ.7,353 కోట్లు) నుంచి 0.43 శాతానికి (రూ.5,209 కోట్లు) మెరుగుపడ్డాయి. ప్రపంచ వ్యాపారాన్ని చూస్తే, 12.11 శాతం వృద్ధితో రూ.28,06,226 కోట్లకు చేరుకుంది. ఇందులో డిపాజిట్లు 9.71 శాతం వృద్ధితో రూ.15,68,678 కోట్లుగా, రుణాలు 15.30 శాతం వృద్ధితో రూ.12,37,548 కోట్లుగా నమోదయ్యాయి. డివిడెండ్: 202526 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.4.20 (210 శాతం) చొప్పున డివిడెండ్ చెల్లించాలని బోర్డు నిర్ణయించింది.

సవాళ్లున్నా ముందుకే... భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మార్కెట్ దాదాపు 4,000 పాయింట్ల మేరకు దిద్దుబాటు జరిగింది. 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ల వడ్డీ 6.59 శాతం నుంచి 7.05 శాతానికి పెరిగింది. దీంతో రూ.800 కోట్ల మేరకు మార్కెట్‌టుమార్కెట్ నష్టాలు వచ్చాయి. పరిస్థితులు చక్కబడితే ఈ నష్టాలు తిరిగి లాభాలుగా మారుతాయని ఆశిస్తున్నట్లు కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హర్దీప్ సింగ్ అహ్లూవాలియా 'ఈనాడు'తో తెలిపారు. ఈ తాత్కాలిక ఒడుదొడుకులను మినహాయిస్తే, బ్యాంకు పనితీరు, ఆస్తుల నాణ్యత మెరుగ్గా ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ రుణాలపై మెరుగైన రాబడులు సాధించడంతో బ్యాంకు నికర వడ్డీ మార్జిన్ 9 బేసిస్ పాయింట్లు మెరుగుపడిందని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 200250 కొత్త శాఖలను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు.

ఐటీ స్టాక్స్‌కు ఓపెన్ఏఐ షాక్

.. ఐటీ ఇండెక్స్ 3% పతనం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బెంచ్ మార్క్ సూచీలు 1 శాతానికి నష్టాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల వల్ల సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా ఓ దశలో 3.7 శాతం మేర నష్టపోయింది. 2023 మే తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన ఏఐ సంస్థ ఓపెన్ఏఐ కొత్త కంపెనీని ప్రకటించడం ఇందుకు నేపథ్యం. శామ్‌ఆల్‌ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ (OpenAI) సంస్థ కొత్తగా 'ఓపెన్ ఏఐ డిప్లాయ్‌మెంట్ కంపెనీ'ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 4 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు తెలిపింది. సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను ఏఐ సిస్టమ్‌స్‌తో నిర్వహించుకోవడం దీని ఉద్దేశం. దీంతో సంప్రదాయ ఐటీ సర్వీస్ కంపెనీల వ్యాపారానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది నేటి ట్రేడింగ్ సెషన్‌లో ప్రతిఫలించిందని నిపుణులు చెబుతున్నారు. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.7 శాతానికి పైగా నష్టంతో దాదాపు 1000 పాయింట్లకు పైగా కోల్పోయి 28,300 స్థాయికి పడిపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్‌లోని అన్ని స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. పెర్సిస్టెంట్ సిస్టమ్స్ ఐదు శాతం మేర పతనం కాగా.. టీసీఎస్, ఎల్‌టీఎం, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, కోఫోర్జ్ సైతం 24 శాతం మేర నష్టోయాయి. అయితే, కేవలం ఏఐ మాత్రమే కాకుండా అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనలు, దీనివల్ల భవిష్యత్‌లో ఐటీ కంపెనీల ఆదాయాలు తగ్గుతాయన్న భయాలూ దీనికి తోడయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల వెలువడిన త్రైమాసిక ఫలితాల సందర్భంగా భవిష్యత్ అంచనాలేమీ అంత ఆకర్షణీయంగా లేకపోవడం కూడా మరో కారణమని చెబుతున్నారు.

హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో తొలిసారి.. AMTతో టాటా ఆల్ట్రోజ్ CNG

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టాటా మోటార్ పాసింజర్ వెహికల్ 5 స్పీడ్ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (AMT)తో కూడిన ఆల్ట్రోజ్ సీఎన్‌జీ వేరియంట్‌ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధరను రూ.8.7 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో సీఎన్‌జీ, ఏఎంటీ ఆప్షన్‌తో వస్తున్న తొలి కారు ఇదే కావడం గమనార్హం. అంతేకాదు ఈ సెగ్మెంట్‌లో డీజిల్ ఇంజిన్ ఆప్షన్ అందిస్తున్న కారు కూడా ఇదే. టాటా ఆల్ట్రోజ్ సీఎన్‌జీ వేరియంట్‌లో పెట్రోల్ వెర్షన్ తరహాలోనే 1.2 లీటర్ త్రీ సిలిండర్ ఇంజిన్ ఇచ్చారు. ఫ్యాక్టరీ ఫిటెడ్ ట్విన్ సిలిండర్ సెటప్ ఉంది. సీఎన్‌జీ మోడ్‌లో 73.5 హెచ్‌పీ పవర్‌ను, 103 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పెట్రోల్ మోడ్‌లో 88 హెచ్‌పీ, 115 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అయితే, పెట్రోల్, డీజిల్ వెర్షన్లతో పోలిస్తే ఇందులో బూట్‌స్పేస్ తక్కువగా ఉంటుంది. పెట్రోల్ వెర్షన్‌లో 345 లీటర్ల బూట్‌స్పేస్ ఇవ్వగా.. ఇందులో 210 లీటర్ల బూట్ స్పేస్ మాత్రమే లభిస్తుంది. టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ఆప్షన్లలో లభిస్తుండగా.. నగర ప్రయాణికుల కోసం కొత్తగా ఏఎంటీ వేరియంట్‌ను లాంచ్ చేశారు. అంటే టూ పెడల్ డ్రైవింగ్ కోరుకునే వారికి ఇది సౌకర్యవంతంగా ఉంటుంది. ఇందులో డీఆర్ఎల్‌స్‌తో కూడిన కనెక్టెడ్ ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్స్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్ ఇచ్చారు. క్యాబిన్ లోపల 26.03 సెంటిమీటర్ల డిజిటల్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది ఇన్ఫోటైన్మెంట్, ఇన్‌స్ట్రుమెంటేషన్ కోసం ఉపయోగపడుతుంది. సాఫ్ట్ టచ్ డ్యాష్‌బోర్డ్, యాంబియంట్ లైటింగ్, లాంజ్ స్టయిల్ రియర్ సీట్లు ఈ కారు ప్రత్యేకత. భారత్ ఎన్‌క్యాప్ పరీక్షల్లో 5 స్టార్ రేటింగ్ పొందిన ఈ కారులో ఆరు ఎయిర్ బ్యాగులున్నాయి. హైఎండ్ వేరియంట్లలో 360 డిగ్రీల కెమెరా, టైర్‌ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఆటో హెడ్‌ల్యాంప్స్, ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్స్ వంటివి లభిస్తాయి.

చమురు సంస్థలకు రూ.లక్ష కోట్ల నష్టాలు రావొచ్చు

చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ

పశ్చిమాసియా సంక్షోభాన్ని తట్టుకోవడానికి ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు ఓ మేల్కొలుపు అని చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ (Hardeep Singh Puri) వెల్లడించారు. అదే సమయంలో దేశంలో ఇంధన సరఫరా సమస్యలు ఏవీ లేవని, ప్రభుత్వం ఉత్పత్తిని రోజుకు 35,000 36,000 టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచినట్లు తెలిపారు. అయితే, భగ్గుమంటున్న ముడిచమురు ధరల వల్ల ఆయిల్ కంపెనీలకు రూ. లక్ష కోట్ల వరకు నష్టాలు రావొచ్చని హెచ్చరించారు. సీఐఐ వార్షిక వ్యాపార సదస్సులో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''పశ్చిమాసియా ఘర్షణల వేళ ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యల గురించి ఆలోచించడానికి ప్రధాని మోదీ (PM Modi) ఇచ్చిన పిలుపు ఒక మేల్కొలుపు. యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని మనం ఎంతో బాధ్యతాయుతంగా ఎదుర్కొన్నాం. ఎక్కడా కొరత లేదు'' అని మంత్రి వెల్లడించారు. దేశంలో 69 రోజులకు సరిపడా ముడిచమురు, ఎల్ఎన్‌జీ స్టాక్ ఉందని, 45 రోజులకు సరిపడా ఎల్‌పీజీ ఉందని పేర్కొన్నారు. అయితే ముడి చమురు ధరలు అధికంగా ఉండి, రిటైల్ ధరలు ఇలాగే కొనసాగితే ఒకే త్రైమాసికంలో ప్రభుత్వరంగ చమురు సంస్థలు రూ.లక్ష కోట్ల వరకు నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆయన అన్నారు. ''చమురు కంపెనీలు రోజుకు రూ.1000కోట్లు నష్టపోతున్నాయి. మొత్తంగా రెవెన్యూ లోటు రూ.1.98లక్షల కోట్లకు పెరిగింది. ఒక్క త్రైమాసికంలోనే రూ.లక్ష కోట్ల మేర నష్టాలు వస్తే, ఈ రంగం ఆర్జించే వార్షిక లాభాలు తుడిచిపెట్టుకుపోతాయి'' అని పేర్కొన్నారు. అమెరికాఇరాన్ ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ పొదుపు చర్యల గురించి దేశ ప్రజలకు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ''పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితులు నెలకొనేంతవరకు దేశ ప్రజలంతా పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలి. ప్రజా రవాణా సౌకర్యాలను ఎక్కువగా వినియోగించుకోవాలి. 'వర్క్ ఫ్రమ్ హోం'ను సంస్థలు ప్రోత్సహించాలి. విద్యాసంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలి. బంగారం కొనుగోలు చేస్తే దేశానికి చెందిన డబ్బులు విదేశాలకు వెళ్లిపోతాయి. కాబట్టి సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు పసిడి కొనకండి. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లకండి. భారత్‌లోనే పెళ్లిళ్లు జరుపుకోండి'' అని మోదీ కోరారు.

పసిడి కొనుగోళ్లు మానేస్తే 3.5 కోట్ల మంది ఉపాధికి ముప్పు

పీయూష్ గోయల్‌కు ఏఐజేజీఎఫ్ లేఖ

దిల్లీ: దేశీయంగా నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని సమీకరించడం, దానిని పునర్వినియోగంలోకి తేవడం ద్వారా విదేశీ మారక ద్రవ్య సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆల్ ఇండియా జువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ (ఏఐజేజీఎఫ్) అభిప్రాయపడింది. విదేశీ మారక నిల్వలను కాపాడేందుకు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలన్న సూచనలు దేశవ్యాప్తంగా దాదాపు 3.5 కోట్ల మంది ఉపాధికి ముప్పుగా పరిణమిస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఫెడరేషన్ సోమవారం ప్రకటన విడుదల చేసింది. విదేశీ మారక నిల్వలను కాపాడుకునే చర్యల్లో భాగంగా పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలని ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు వాయిదా వేయడం కాకుండా దేశీయ పసిడి సమీకరణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని ఏఐజేజీఎఫ్ కోరింది. ఈ విషయమై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఏఐజేజీఎఫ్ జాతీయ అధ్యక్షుడు పంకజ్ అరోరా లేఖ రాశారు. 'పెరుగుతున్న దిగుమతుల బిల్లు, విదేశీ మారక నిల్వలపై ప్రభుత్వ ఆందోళన అర్థం చేసుకోదగినదే. దానికి పరిష్కారం పసిడి గిరాకీని తగ్గించడం కాదు. దీనివల్ల ఆభరణాల తయారీ రంగం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది' అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. వినియోగదారుల ఆలోచనా ధోరణిలో అకస్మాత్తుగా వచ్చే ప్రతికూల మార్పుల వల్ల ఆభరణాల దుకాణాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య తగ్గడమే కాకుండా, తయారీ ఆర్డర్లు మందగిస్తాయని ఫెడరేషన్ హెచ్చరించింది. దీనివల్ల సరఫరా వ్యవస్థలో అత్యంత కీలకమైన చిన్న తరహా ఆభరణాల వ్యాపారులు, చేతివృత్తుల వారి ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇది కేవలం పసిడి వ్యాపారానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, జీవనోపాధి సమస్య అని తేల్చిచెప్పింది. ప్రభుత్వానికి ఏఐజేజీఎఫ్ కీలక ప్రతిపాదనలు: బంగారం కొనుగోళ్ల తగ్గింపునకు బదులుగా పలు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని ఏఐజేజీఎఫ్ ప్రభుత్వానికి సూచించింది. దేశీయంగా బంగారాన్ని సమీకరించడానికి ప్రత్యేక బులియన్ బ్యాంకును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. గోల్డ్ ఈటీఎఫ్‌లు తమ వద్ద ఉన్న భౌతిక నిల్వల్లో 2030 శాతాన్ని నియంత్రిత వ్యవస్థ ద్వారా రుణాలుగా ఇచ్చేందుకు అనుమతించాలని కోరింది. 2015లో ప్రారంభించిన ప్రభుత్వ గోల్డ్ మానిటైజేషన్ పథకం కొన్ని లోపాల కారణంగా ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదని, దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని సూచించింది. రుణాలకు పూచీకత్తుగా ఉపయోగపడే డీమెటీరియలైజ్డ్ బులియన్ డిపాజిట్ సర్టిఫికెట్లను తీసుకురావడం, అంతర్గత పసిడి బదిలీలపై పన్ను, జీఎస్‌టీ తీసేయడం, పసిడి సమీకరణ, దిగుమతుల ప్రత్యామ్నాయాన్ని గుర్తించేందుకు జాతీయ డాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయడం వంటి ఇతర ప్రతిపాదనలను చేసింది.

భారత మార్కెట్లోకి గాన్ పవర్ ఐసీలు



హైదరాబాద్: దేశీయ సెమీకండక్టర్స్ రంగంలో హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ సెమీకండక్టర్స్ సరికొత్త ఆవిష్కరణను తీసుకొచ్చింది. గ్లోబల్ సాంకేతిక దిగ్గజం న్యావిటాస్ సెమీకండక్టర్స్ సహకారంతో, భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన గాలియం నైట్రైడ్ (గ్యాన్) పవర్ ఐసీలను సోమవారం ఆవిష్కరించింది. భారత్‌లో వాణిజ్య పరంగా అందుబాటులోకి వచ్చిన తొలి గాన్ పవర్ ఐసీ ఉత్పత్తులు ఇవేనని సంస్థ పేర్కొంది. 650 ఓల్ట్స్ సామర్థ్యంతో పనిచేసే ఈ ఏడు అత్యాధునిక పరికరాలను తీసుకొచ్చినట్లు తెలిపింది. వీటిని జూన్ నుంచి వినియోగదారులకు అందుబాటులోకి తెస్తామని వెల్లడించింది. ఈ అత్యాధునిక పరికరాలను ఎడ్జ్ ఏఐ, ఇమొబిలిటీ, ఏఐ డేటా సెంటర్లు, టెలిమ్యూనికేషన్లు, ఫాస్ట్ ఛార్జింగ్, పారిశ్రామిక పవర్ సిస్టమ్స్ వంటి రంగాల్లో పెరుగుతున్న గిరాకీని తీర్చేందుకు రూపొందించారు. గత ఏడాది డిసెంబరులో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా న్యావిటాస్ పరికరాల సరఫరానూ తాచేపట్టనున్నట్లు సైయెంట్ సెమీకండక్టర్స్ సీఈఓ సుమన్ నారాయణ్ తెలిపారు. న్యావిటాస్ 2.0 వృద్ధి వ్యూహంలో భాగంగా భారత్ అత్యంత కీలకమైన మార్కెట్ అని సంస్థ సీఈఓ, ప్రెసిడెంట్ క్రిస్ అలెగ్జాండర్ వెల్లడించారు.

డిసెంబరులో అక్షయ్ వినోదాలు

అక్షయ్ కుమార్ కథానాయకుడిగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మాత దిల్‌రాజు ఓ బాలీవుడ్ సినిమా నిర్మిస్తున్నారు. అనీస్ బాజ్మీ దర్శకుడు. విద్యా బాలన్, రాశీ ఖన్నా కథానాయికలు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాని ఈ ఏడాది డిసెంబరు 4న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగులో వెంకటేశ్ - అనిల్ రావిపూడి కలయికలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని మూల కథను స్ఫూర్తిగా తీసుకొని.. ఓ కొత్త స్క్రిప్ట్‌తో దీన్ని ముస్తాబు చేస్తున్నట్లు చిత్ర బృందం ఇది వరకే వెల్లడించింది. ఈ వినోదాత్మక ఫ్యామిలీ యాక్షన్ డ్రామాలో అక్షయ్ పోలీస్ పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది.

సూర్య త్రిష మూవీ స్పెషల్ షోలకు అనుమతి.. విజయ్‌కు థాంక్స్

తమ సినిమా స్పెషల్ షోలకు అనుమతి ఇచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ (CM Vijay)కు 'కరుప్పు' నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ కృతజ్ఞతలు తెలిపింది. మే 14న ఉదయం 9గంటల నుంచే 'కరుప్పు' (Karuppu) సందడి మొదలవుతుందంటూ పోస్టు పెట్టింది. ఈనెల 14, 15న ఉదయం 9గంటల ప్రదర్శనకు తమిళనాడు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రోజుకు ఐదు షోలు మించకుండా ఉండాలని సూచించింది. కొంతకాలంగా తమిళనాడులో ప్రత్యేక ప్రదర్శనలు లేవన్న సంగతి తెలిసిందే. చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తిగా విజయ్.. స్పెషల్ షోలకు పర్మిషన్ ఇస్తారని సినీ అభిమానులు ఆశించారు. అంతా అనుకున్నట్టే ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో కోలీవుడ్‌లో జోష్ నెలకొంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనంతరం స్పెషల్ షోలతో ప్రదర్శితమయ్యే తొలి చిత్రమిదే. సూర్య (Suriya), త్రిష (Trisha) ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఆర్జే బాలాజీ తెరకెక్కించిన సినిమా ఇది. ఇందులో బాలాజీ కీలక పాత్ర పోషించారు. దైవిక అంశాలతో ముడిపడిన కోర్టురూమ్ డ్రామా కథతో రూపొందింది. యాక్షన్‌కూ ప్రాధాన్యం ఉంది. తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల కానుంది.

ప్రేమని ఓ లావాదేవీలా చూడొద్దు

"బంధాలనేవి మన ఎదుగుదలకు తోడ్పడేవిగా ఉండాలి గానీ, మనల్ని బంధించేవిగా ఉండకూడదు" అంటోంది నటి తమన్నా. పరస్పర గౌరవం ఉన్న చోటే నిజమైన ప్రేమ వెల్లివిరుస్తుందని చెబుతోంది. "ప్రతిఫలం ఆశించకుండా ప్రేమించడమే నిజమైన ప్రేమ. అదే స్వచ్ఛమైనది. ఏ ప్రేమైనా సరే ఎలాంటి షరతుల్లేనిదై ఉండాలి. దాన్నెప్పుడూ ఓ లావాదేవీలా చూడొద్దు. మనం అవతలి వాళ్లకు ఏదో ఇస్తున్నాం కనుక వాళ్ల నుంచి తిరిగి ఏదో ఆశించడం ఎప్పుడూ ప్రేమ అనిపించుకోదు" అని ప్రేమ పట్ల తన ఆలోచనల్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది తమన్నా. ఆమె ప్రస్తుతం హిందీలో 'వివన్ - ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్', 'రాగిణి 3', 'వి శాంతారామ్' తదితర చిత్రాల్లో నటిస్తోంది.

'శంబాల' బృందం.. మరో హారర్ సినిమా

గతేడాది 'శంబాల' సినిమాతో చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు హీరో ఆది సాయికుమార్. యుగంధర్ ముని తెరకెక్కించిన ఈ చిత్రాన్ని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు నిర్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడిదే నిర్మాతలతో దర్శకుడు యుగంధర్ సమర్పణలో ఆది కథానాయకుడిగా మరో సినిమా పట్టాలెక్కనుంది. దీనికి బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మేరకు ఈ చిత్ర కాన్సెప్ట్ పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో ఆది నెత్తురోడుతున్న ముఖంతో సీరియస్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. ''భయం, ఉత్కంఠ, అపరిమిత వినోదం, బలమైన భావోద్వేగాలతో భారతీయ తెరపై మునుపెన్నడూ చూడని ఓ అద్భుత కథను చూపించనున్నాం. వినూత్నమైన కథాంశంతో ముస్తాబు కానున్న ఈ హారర్ సినిమాతో ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించనున్నాం. దీనికి సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. అందుకే దీనికోసం శ్రీచరణ్ పాకాలను ఖరారు చేశాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర వర్గాలు తెలిపాయి.

న్యాయానికి.. ధనవంతులైనా పేదవాళ్లే

కథానాయికలు జ్యోతిక, సోనాక్షీ సిన్హా ఓటీటీ వేదికగా సినీప్రియుల్ని అలరించడానికి సన్నద్ధమైపోయారు. వారిద్దరూ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'సిస్టమ్'. అశుతోష్ గోవారికర్ ఇందులో కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి అశ్వినీ అయ్యర్ తివారీ దర్శకత్వం వహించారు. అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సినిమా మే 22 నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా ప్రైమ్ సామాజిక మాధ్యమాల్లో ఈ చిత్ర అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇందులో 'ధనవంతులైనా.. పేదవాళ్లే. న్యాయం మీద అందరికీ హక్కు ఉంటుంది' 'ధనవంతుల అరుపుల్లో పేదవాడి గొంతు మూగబోతుంది' లాంటి ఆకట్టుకునే డైలాగ్‌లు ఆకర్షణగా నిలిచాయి. కేసులు ఛేదించడానికి జ్యోతిక, సోనాక్షి వేసే ఎత్తుగడలతో కోర్టురూమ్ సన్నివేశాలను ఈ చిత్రంలో ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తుంది. ఈ సినిమాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నేహాగా.. సోనాక్షి, కోర్టులో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తున్న సారిక పాత్రలో జ్యోతికలు కనిపించనున్నారు. న్యాయం కోసం భిన్న మార్గాల్లో కలిసి పోరాడుతున్న ఇద్దరు మహిళల చుట్టూ తిరుగుతుందీ చిత్రం.

జంట కుదిరిందా!

కథానాయకుడు శర్వానంద్ ప్రస్తుతం 'భోగి' చిత్రాన్ని ముగించే పనిలో ఉన్నారు. ఇది పూర్తయిన వెంటనే దర్శకుడు శ్రీను వైట్ల సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. ఇది సంక్రాంతి లక్ష్యంగా ముస్తాబు కానున్నట్లు శర్వా గతంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే జులై కల్లా దీన్ని పట్టాలెక్కించేందుకు తెర వెనుక పనులు జోరుగా సాగుతున్నాయి. దీనిలో భాగంగానే చిత్ర బృందం కథానాయిక ఎంపికపైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో శర్వాకి జోడీగా మమితా బైజు, పూజా హెగ్డే.. ఇలా పలువురి పేర్లు ప్రచారంలో వినిపించాయి. అయితే ప్రస్తుతం జాబితాలోకి మానస వారణాసి పేరు చేరింది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో అందర్నీ మెప్పించిన ఈ భామ.. ఇప్పుడీ కొత్త చిత్రంలో శర్వాకి జంటగా నటించే అవకాశముందని సమాచారం. ప్రస్తుతం దీనిపై చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. ఇది శ్రీను వైట్ల శైలికి తగ్గ వినోదాత్మక సినిమాగా రూపొందనుందని.. టైమ్ ట్రావెల్ అంశాలు మిళితమై ఉంటాయని టాక్. ఈ చిత్ర నిర్మాణ సంస్థతో పాటు మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

ఈ రోజుల్లో సాధారణ పాత్రలతో కష్టమే

'మిమి' చిత్రానికి జాతీయ పురస్కారంతో ప్రేక్షకుల్లో నాపై ఉన్న కొన్ని అభిప్రాయాలను బద్దలు కొట్టానని అంటోంది బాలీవుడ్ హీరోయిన్ కృతీ సనన్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి తన కెరీర్‌ని మలుపు తిప్పిన ఆసక్తికర సంఘటన గురించి పంచుకుంది. "నా సినీ ప్రస్థానంలో అన్నింటికన్నా గొప్ప విజయం 'మిమి' చిత్రానికి లభించింది. ఈ సినిమాకి నాకు జాతీయ పురస్కారం రావడం కెరీర్‌లోనే అత్యున్నత ఘట్టాలలో ఒకటి. భుజాలపై మోసిన నా మొదటి ప్రాజెక్ట్ అది. కెరీర్‌లో ఇంకా ముందుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రేక్షకులు కూడా అదే కోరుకుంటున్నారని భావిస్తున్నా. గత రెండేళ్లు నాకు అద్భుతంగా గడిచాయి. 'తేరీ బాతోంమే ఐసా ఉల్ఝా జియా', 'క్రూ', 'దో పత్తి', 'తేరే ఇష్క్ మే' లాంటి నేను నటించిన చిత్రాలన్నీ విభిన్న పాత్రలు, నేపథ్యాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఇలా వరుస చిత్రాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం ఎంతో ముఖ్యం. ఈరోజుల్లో సాధారణ పాత్రలు చేస్తే సరిపోద"ని చెప్పుకొచ్చింది. 2021లో కరోనా కారణంగా ఓటీటీలో విడుదలైంది 'మిమి' చిత్రం. ఇందులో సరోగసి ద్వారా గర్భం దాల్చిన మిమి పాత్రలో భావోద్వేగ నటనతో వీక్షకుల్ని కట్టిపడేసింది కృతి. ఆమె తదుపరి 'కాక్‌టెయిల్ 2' సినిమాలో షాహిద్ కపూర్, రష్మికలతో కలిసి నటిస్తుంది.



ఐపీఎల్‌లో ఎక్కువగా మాట్లాడుకుంది వీరి గురించే..

ఐపీఎల్ 2026 ఆఖరి దశకు చేరుకోవడంతో మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఎనిమిది జట్లు ప్లే ఆఫ్స్ రేసులో ఉండగా.. ముంబయి, లఖ్‌నవూలకు టాప్4లో నిలిచే ఛాన్స్ లేదు. ఈ క్రమంలో ప్రస్తుత సీజన్‌లో అభిమానులు సోషల్ మీడియాలో ఏ క్రికెటర్ల గురించి ఎక్కువగా మాట్లాడుకున్నారనే విషయాన్ని ఐపీఎల్ అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ వెల్లడించింది. మార్చి 28 నుంచి మే 12 వరకు ఉన్న డేటాను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితాను రూపొందించారు.

ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే.. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్, టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు ఇందులో లేదు. వైభవ్ ఈ ఐపీఎల్‌లో 36 బంతుల్లోనే ఓ సెంచరీ చేశాడు. అంతేకాదు రెండుసార్లు 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీలు బాదాడు. మరి స్టార్‌స్పోర్ట్స్ వెల్లడించిన టాప్5 ప్లేయర్లలో ఎవరున్నారో తెలుసుకుందాం. ఆర్సీబీ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ (44 శాతం) టాప్‌లో ఉన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ మహేంద్ర సింగ్ ధోనీ (21 శాతం) రెండో స్థానం దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో ధోనీ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడనప్పటికీ అతనికి ఏ మాత్రం క్రేజ్ తగ్గలేదనడానికి ఇదే నిదర్శనం. ముంబయి ఆటగాడు రోహిత్ శర్మ (18 శాతం), సంజు శాంసన్ (10 శాతం), కేఎల్ రాహుల్ (8 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచారు.

టైటాన్స్ అదరహో.. వరుసగా అయిదో విజయం

అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ అదరహో. తొలి ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు మాత్రమే నెగ్గి ప్లేఆఫ్స్ పోటీలో లేనట్లు కనిపించిన ఆ జట్టు.. తర్వాత అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతోంది. వరుసగా అయిదో విజయంతో ప్లేఆఫ్స్‌లో స్థానాన్ని దాదాపుగా ఖాయం చేసుకుంది. మంగళవారం సన్‌రైజర్స్‌పై టైటాన్స్ కేవలం 169 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకున్న తీరు అమోఘం. రబాడ, హోల్డర్, సిరాజ్ విజృంభించిన వేళ.. స్వల్ప ఛేదనలో హైదరాబాద్ తేలిపోయింది. భారీ పరాజయాన్ని చవిచూసింది. 12 మ్యాచ్‌ల్లో ఎనిమిది విజయాలు సాధించిన జీటీ.. ఆర్సీబీని వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరుకుంది. రన్‌రేట్‌నూ బాగా మెరుగుపర్చుకుంది.

ఐపీఎల్19లో గుజరాత్ టైటాన్స్ జోరు కొనసాగుతోంది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 82 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తు చేసింది. సాయి సుదర్శన్ (61; 44 బంతుల్లో 5×4, 2×6), వాషింగ్టన్ సుందర్ (50; 33 బంతుల్లో 7×4, 1×6) అర్ధశతకాలు సాధించడంతో మొదట గుజరాత్ 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. కమిన్స్ (1/20), ప్రఫుల్ హింగే (2/17), సాకిబ్ హుస్సేన్ (2/37) గుజరాత్‌ను కట్టడి చేశారు. ఛేదనలో సన్‌రైజర్స్ చేతులెత్తేసింది. రబాడ (3/28), హోల్డర్ (3/20), ప్రసిద్ధ్ (2/23), సిరాజ్ (1/11)ల ధాటికి 14.5 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలింది. 19 పరుగులు చేసిన కమిన్స్ టాప్ స్కోరర్. సన్‌రైజర్స్‌కు 12 మ్యాచ్‌ల్లో ఇది అయిదో ఓటమి.

సన్‌రైజర్స్ దాసోహం: లక్ష్యం స్వల్పమే అయినా ఛేదనలో సన్‌రైజర్స్ ఆపసోపాలు పడింది. టైటాన్స్ బౌలర్ల ధాటికి విలవిలలాడిపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆ జట్టు, ఏ దశలోనూ గెలిచేలా కనపడలేదు. బౌలింగ్ దాడిని సిరాజ్ అద్భుతంగా ఆరంభించాడు. పదునైన పేస్‌తో తొలి ఓవర్లో ఒక్క పరుగు కూడా ఇవ్వని అతడు.. విధ్వంసక ఓపెనర్ హెడ్ (0)ను ఔట్ చేశాడు. తర్వాతి ఓవర్లోనే అభిషేక్ (6)ను బౌల్డ్ చేసి.. సన్‌రైజర్స్‌కు రబాడ షాకిచ్చాడు. ఆ తర్వాత ఏ దశలోనూ ఆ జట్టు పతనం ఆగలేదు. ఒక్క బ్యాటర్ కూడా నిలవలేకపోయాడు. సూపర్ బౌలింగ్‌ను కొనసాగించిన రబాడ.. తన తర్వాతి రెండు ఓవర్లలో ఇషాన్ కిషన్ (11), స్మరన్ (9)లను ఔట్ చేసి ప్రత్యర్థి వెన్నువిరిచాడు. పవర్‌ప్లే ఆఖరుకు 34/4తో సన్‌రైజర్స్ కష్టాల్లోకి కూరుకుపోయింది. కొన్ని బౌండరీలు కొట్టినా... సలీల్ అరోరా (16), క్లాసెన్ (14) ఎంతో సేపు నిలవలేకపోయారు. అరోరాను ప్రసిద్ధ్ వెనక్కి పంపాక.. హోల్డర్ జోరు మొదలైంది. అతడు ఒకే ఓవర్లో క్లాసెన్, నితీశ్ కుమార్‌రెడ్డి (2)ని ఔట్ చేయడంతో 60/7తో సన్‌రైజర్స్ ఓటమి ఖాయమైపోయింది. మిగతా ఆట లాంఛనమే. హోల్డర్ తన తర్వాతి ఓవర్లో శివాంగ్ కుమార్ (4)ను ఔట్ చేశాడు. కమిన్స్ రెండు సిక్స్‌లు బాదినా.. అతడి దూకుడుకు ప్రసిద్ధ్ త్వరగానే తెరదించాడు. హింగేను రషీద్ ఖాన్ ఔట్ చేయడంతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ ముగిసింది. హోల్డర్ 15.. సిరాజ్, రబాడ చెరో 13 డాట్ బాల్స్ వేయడం విశేషం.

నిలిచిన ఆ ఇద్దరు: అంతకుముందు గుజరాత్ తడబడింది. కాస్త మందకొడిగా ఉన్న పిచ్‌పై పరుగులు అంత తేలికగా రాలేదు. అయితే సాయి సుదర్శన్, సుందర్‌ల పోరాటం ఆ జట్టుకు పోటీ ఇవ్వదగ్గ స్కోరును అందించాయి. గుజరాత్ ఆరంభం పేలవం. పవర్‌ప్లే ముగిసే సరికి 34 పరుగులే చేసి రెండు వికెట్లు కోల్పోయింది. సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో ఆరు ఓవర్లలో అయిదు బౌండరీలు మాత్రమే వచ్చాయి. శుభ్‌మన్ గిల్ (5), బట్లర్ (7) లను ఇద్దరినీ హింగే ఔట్ చేశాడు. ఆ దశలో సుదర్శన్ నిలబడ్డాడు. నిశాంత్ సింధు (22; 14 బంతుల్లో 3×4, 1×6)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కానీ సుదర్శన్ ధాటిగా ఆడలేకపోయాడు. ఎదుర్కొన్న తొలి 25 బంతుల్లో అతడు చేసింది 28 పరుగులే. నిశాంత్ కాస్త బ్యాట్ ఝుళిపించినా.. ఎక్కువసేపు నిలవలేకపోయాడు. పదో ఓవర్లో అతడు నిష్క్రమించేటప్పటికి స్కోరు 64 పరుగులు మాత్రమే. అయితే సుదర్శన్‌కు సుందర్ తోడయ్యాక ఇన్నింగ్స్‌కు కాస్త ఊపొచ్చింది. సుదర్శన్ వేగం పెంచాడు. ఇషాన్ మలింగ, సకిబ్ ఓవర్లలో ఒక్కో సిక్స్ బాదాడు. మొదట్లో నెమ్మదిగా ఆడిన సుందర్.. క్రమంగా వేగం పెంచాడు. అయితే 17వ ఓవర్లో సాకిబ్ బౌలింగ్‌లో సుదర్శన్ నిష్క్రమించడంతో 60 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అయితే సుందర్ చెలరేగడంతో ఆఖరి మూడు ఓవర్లలో టైటాన్స్ 35 పరుగులు రాబట్టింది. రబాడ మూడు వికెట్లు తీశాడు. హోల్డర్ కూడా ముగ్గురిని ఔట్ చేశాడు. ఆ ఇద్దరూ చక్కటి ప్రదర్శన చేసినప్పటికీ.. ఈ మ్యాచ్‌లో హైలైట్ మాత్రం సిరాజ్ బౌలింగే. అతను పడగొట్టింది ఒక్క వికెట్టే అయినా అదెంతో కీలకమైంది. దూకుడుకు మారుపేరైన సన్‌రైజర్స్‌ను సిరాజ్ మామూలుగా ఇబ్బంది పెట్టలేదీ మ్యాచ్‌లో. అతను వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే మెయిడెన్ వికెట్ సాధించడం విశేషం. స్కోరు బోర్డుపై ఒక్క పరుగైనా చేరకముందే ప్రమాదకర ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసిన అతను.. మిగతా హైదరాబాద్ బ్యాటర్లను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. తన మూడో ఓవర్లో ఒక్క పరుగే ఇచ్చాడు. అతను సంధించిన 18 బంతుల్లో 13 డాట్‌బాల్సే. సిరాజ్ ఆరంభంలో కొట్టిన దెబ్బతో సన్‌రైజర్స్ తర్వాత కోలుకోలేకపోయింది.

స్కోరు వివరాలు

గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ (సి) హింగే (బి) సాకిబ్ 61; గిల్ (సి) క్లాసెన్ (బి) హింగే 5; బట్లర్ (సి) ఇషాన్ (బి) హింగే 7; నిశాంత్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 22; సుందర్ (సి) ఇషాన్ (బి) సాకిబ్ 50; హోల్డర్ నాటౌట్ 11; తెవాతియా నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 168; వికెట్ల పతనం: 1-15, 2-26, 3-64, 4-124, 5-164; బౌలింగ్: కమిన్స్ 4-0-20-1; నితీశ్ 3-0-27-0; హింగే 3-0-17-2; మలింగ 4-0-46-0; సాకిబ్ 4-0-37-2; శివాంగ్ 2-0-19-1

హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) నిశాంత్ (బి) సిరాజ్ 0; అభిషేక్ (బి) రబాడ 6; ఇషాన్ (సి) బట్లర్ (బి) రబాడ 11; స్మరణ్ (సి) శుభ్‌మన్ (బి) రబాడ 9; క్లాసెన్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 14; సలీల్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 16; నితీశ్ (సి) సుందర్ (బి) హోల్డర్ 2; కమిన్స్ (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ 19; శివాంగ్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 4; హింగే (స్టంప్డ్) బట్లర్ (బి) రషీద్ 3; మలింగ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (14.5 ఓవర్లలో ఆలౌట్) 86; వికెట్ల పతనం: 1-0, 2-6, 3-23, 4-32, 5-56, 6-56, 7-60, 8-72, 9-82; బౌలింగ్: సిరాజ్ 3-1-11-1; రబాడ 4-0-28-3; హోల్డర్ 4-0-20-3; ప్రసిద్ధ్ 3-0-23-2; రషీద్ 0.5-0-3-1

ద్రవిడ్‌కూ ఓ టీ20 ఫ్రాంఛైజీ

దిల్లీ: బ్యాటర్, కెప్టెన్, వికెట్‌కీపర్, కోచ్, మెంటార్.. ఇలా తన కెరీర్‌లో భిన్నమైన పాత్రలు పోషించిన భారత దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ ఇప్పుడు ఓ కొత్త అడుగు వేశాడు. ఓ ఫ్రాంఛైజీకి యజమాని అయ్యాడు. ఐరోపా టీ20 లీగ్‌లో డబ్లిన్ గార్డియన్స్ జట్టును తాజాగా ద్రవిడ్ కొన్నాడు. ఈ ఏడాది ఆగస్టులో ఆరు ఫ్రాంఛైజీలు తలపడే ఐరోపా లీగ్ ఆరంభం కానుంది. ఐరోపాలో ఐసీసీ ఆమోదం పొందిన తొలి బహుళ దేశాల క్రికెట్ టోర్నీ ఇదే. ఐర్లాండ్, స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ సంఘాలు ఈ లీగ్‌లో భాగమయ్యాయి. ''ఐరోపాలో దిగువ స్థాయి నుంచి క్రికెట్లో ప్రతిభావంతులను వెలికి తీయడానికి ఈ లీగ్ ఉపయోగపడుతుంది. ఇక్కడ ఆట ఎదుగుదలకు ఇదెంతో సహకరిస్తుంది. నన్ను ఆకట్టుకున్న అంశం అదే. అందుకే డబ్లిన్ గార్డియన్స్ జట్టును కొని ఈ లీగ్‌లో భాగమయ్యా. స్టార్ ప్లేయర్లతో స్థానిక కుర్రాళ్లు కలిసి ఆడబోతుండడంతో ఈ లీగ్ ఆసక్తికరంగా సాగబోతోంది'' అని ద్రవిడ్ చెప్పాడు. మరోవైపు బ్యాటర్లకు పెద్దపీట వేస్తున్న టీ20ల్లో రాణించాలంటే బౌలర్లు తమ ఆటను మరింత మెరుగుపరుచుకోవాలని ద్రవిడ్ అన్నాడు. ''గత మూడేళ్ల నుంచి చూస్తే టీ20ల్లో బ్యాటింగ్ నాణ్యత మరింత పెరిగింది. బ్యాటర్లు ఎలాగైనా ఫోర్లు, సిక్స్‌లు కొట్టేస్తున్నారు. భిన్నమైన షాట్లు ప్రయత్నిస్తున్నారు. వారిని సవాల్ చేయాలంటే బౌలర్లు కూడా తమ ఆటను మెరుగుపరుచుకోవాలి. తమ నైపుణ్యాలను పెంచుకోవాలి'' అని ద్రవిడ్ తెలిపాడు. ఐరోపా టీ20 లీగ్‌లో ఫ్రాంఛైజీల కొనుగోళ్లలో పలువురు మాజీ క్రికెటర్లతో పాటు బాలీవుడ్ స్టార్లు కూడా భాగమయ్యారు. అభిషేక్ బచ్చన్ ఐరోపా లీగ్ వ్యవస్థాపకుల్లో ఒకడు. ఐరిష్ వోల్ఫ్స్ జట్టుకు మ్యాక్స్‌వెల్.. ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్‌స్‌కు స్టీవ్ వా.. ఎడిన్‌బరో క్యాజిల్ రాకర్‌స్‌కు మెక్‌కలమ్, కైల్ మిల్స్.. గ్లాస్గో కాస్మిక్‌కు జాంటీ రోడ్స్, డుప్లెసిస్, క్లాసెన్ సహ యజమానులుగా ఉన్నారు. స్టీవ్ స్మిత్, మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, మిచెల్ శాంట్నర్, లివింగ్‌స్టన్ లాంటి ప్రస్తుత క్రికెటర్లతో పాటు మాజీ ఆటగాళ్లు మెక్‌కలమ్, రోడ్స్, డుప్లెసిస్, క్లాసెన్ ఈ లీగ్‌లో ఆడబోతున్నారు.

కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేస్తే డబ్బులిస్తామన్నారు: జర్మనీ మోడల్ లిజ్లాజ్

కొన్ని రోజుల కిందట విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి కొట్టిన లైక్‌తో జర్మనీ మోడల్ లిజ్లాజ్ పాపులరైన సంగతి తెలిసిందే. దీంతో కోహ్లీని నెటిజన్లు ట్రోల్ చేశారు. ఆ లైక్ వెనక అతనికి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారని లిజ్లాజ్ (LizLaz) అప్పట్లోనే క్లారిటీ ఇచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఈ అంశానికి సంబంధించి సంచలన విషయాన్ని బయటపెట్టింది. కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేసేలా తనను ఒప్పించడానికి కొంతమంది జర్నలిస్టులు సంప్రదించారని, అలా చేయడానికి తనకు డబ్బు కూడా ఆఫర్ చేశారని పేర్కొంది. ''కొందరు విలేకరులు విరాట్ కోహ్లీ గురించి చెడుగా మాట్లాడాలని నన్ను ఒప్పించడానికి ప్రయత్నించారు. అతనిపై లేని పోని ఆరోపణలు చేయమని డబ్బు ఆఫర్ చేశారు. కానీ నేనెందుకు అలా చేస్తాను?డబ్బు లేదా ప్రచారం కోసం కోహ్లీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఆసక్తి గానీ, ఉద్దేశం గానీ నాకు లేదు'' అని లిజ్లాజ్ తెలిపింది.

ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ 'లైక్' నేపథ్యంలో కోహ్లీపై ట్రోలింగ్ జరగడంతో ఈ జర్మనీ మోడల్ కొన్ని రోజుల కిందట స్పందించింది. విరాట్‌పై విమర్శలు రావడం బాధగా అనిపించిందని పేర్కొంది. ''ముందు విరాట్ కోహ్లీ (Virat Kohli) నా ఫొటోని లైక్ చేసినప్పుడు ఎంతో సంతోషించాను. ఆ తర్వాత ఆ పోస్ట్‌ని ఆయన అన్‌లైక్ చేశారు. అనుకోకుండా నేను పాపులర్ అయినందుకు ఆనందమే కానీ, తర్వాత బాధగా అనిపించింది. ఈ ఒక్క లైక్ సోషల్ మీడియాలో ఇంత పెద్ద స్టోరీ అవుతుందని ఊహించలేదు. కోహ్లీని ఇంతగా ట్రోల్ చేస్తారనుకోలేదు. ఆ లైక్ వెనక అతనికి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఏదేమైనా నా ఫొటోని స్టార్ క్రికెటర్ లైక్ చేసినందుకు గర్వంగా అనిపించింది'' అని లిజ్లాజ్ వివరించింది. ఈ జర్మనీ మోడల్‌కు ఐపీఎల్ మ్యాచ్‌లంటే తెగ ఇష్టమట. ఆర్సీబీకి వీరాభిమాని అని చెప్పింది.

వినేశ్ పునరాగమనానికి సాక్షి మద్దతు

దిల్లీ: తల్లిగా రెజ్లింగ్ రింగ్‌లో పునరాగమనం చేయాలని అనుకుంటున్న వినేశ్ ఫొగాట్‌కు ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ మద్దతు తెలిపింది. ప్రపంచవ్యాప్తగా క్రీడాకారిణులు తల్లులైన తర్వాత తిరిగి క్రీడల్లోకి వచ్చేందుకు నిబంధనలు సడలిస్తుంటే.. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాత్రం వినేశ్‌ను అడ్డుకుంటోందని సాక్షి ఆరోపించింది. ఇటీవల గొండాలో జరిగిన జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో డబ్ల్యూఫ్ఐ తనను అనర్హురాలిగా ప్రకటించినా.. 10 నెలల కొడుక్కి తల్లి అయిన వినేశ్ పోటీల కోసం అక్కడికి రావడం చర్చనీయాంశమైంది. డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ నుంచి తిరిగి రావాలనుకునే క్రీడాకారులు ఆరు నెలలు ముందస్తు నోటీసు ఇవ్వడం తప్పనిసరి అని.. ఆ గడువు పూర్తవకుండా పోటీపడటానికి వీల్లేదంటూ వినేశ్‌కు పంపిన షోకాజ్ నోటీసులో డబ్ల్యూఎఫ్ఐ పేర్కొంది. ''ప్రస్తుతం వినేశ్ ఒక రాజకీయ పార్టీ తరపున ఎమ్మెల్యేగా కొనసాగుతోంది. నాకు రాజకీయాలతో సంబంధం లేదు. కానీ మహిళలు తల్లులైన తర్వాత కూడా పతకాలు సాధించేలా చాలా దేశాలు నిబంధనలు సడలిస్తున్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. వినేశ్ పునరాగమనాన్ని అడ్డుకోడానికే డబ్ల్యూఎఫ్ఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ జోక్యం చేసుకోవాలి. వినేశ్‌కు ట్రయల్స్ నిర్వహించి.. ఆమె దేశానికి పతకాలు సాధించేలా అవకాశం కల్పించాలి. తల్లి అయిన తర్వాత కూడా రాణించొచ్చని ఇతర మహిళలకు ఆమె ఒక ఉదాహరణగా నిలుస్తుంది'' అని సాక్షి పేర్కొంది.

శ్రమించి గెలిచిన సాత్విక్ – చిరాగ్ జోడీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి శుభారంభం చేశారు. మంగళవారం పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో టాప్ సీడ్ సాత్విక్ చిరాగ్ జోడీ 2119, 2123, 2110తో పుత్ర ఇర్వియన్‌స్యా బాగాస్ మౌలానా (ఇండోనేసియా) జంటపై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు జరిగిన పోరులో తొలి రెండు గేమ్‌లు హోరాహోరీగా సాగాయి. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సాత్విక్ చిరాగ్ జంట టాప్ గేర్‌లో ఆడింది. సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తూ 11 5తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. విరామానంతరం మరింత జోరు పెంచిన భారత జోడీ 21 10తో మూడో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.